# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

శుక్రవారం | 5 డిసెంబర్ 2025 | పేజీలు 8




# పారిశ్రామిక భూములతో..!

# రూ.5 లక్షల కోట్లు భూ కుంభకోణం..!

## పారిశ్రామిక భూములు చౌకగా ప్రైవేటుకు కట్టబెడుతున్నారని కేటీఆర్ వ్యాఖ్యలు..

- జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో బీఆర్ఎస్ బృందం క్షేత్రస్థాయి పరిశీలన..
- నెలలుగా కొనసాగుతున్న భూదోపిడీ రూ.5 లక్షల కోట్ల కుంభకోణం: కేటీఆర్..
- "ఆషాడం సేల్" మాయలో పారిశ్రామికవేత్తలు పడవద్దని కేటీఆర్ హెచ్చరిక..
- కాంగ్రెస్ ప్రభుత్వం భూదోపిడీని కార్మిక సంఘాలు అడ్డుకోవాలని కేటీఆర్ పిలుపు..
- తమ బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే అక్రమ భూములు వెనక్కి తీసుకుంటామన్న కేటీఆర్.



పారిశ్రామిక వాడలో కేటీఆర్‌తో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ నేత వారాల వినోద్ కుమార్..



కుత్బుల్లాపూర్ జీడిమెట్ల పారిశ్రామిక వాడలో కేటీఆర్ పర్యటన..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 4:** తెలంగాణలో పారిశ్రామిక భూములను చౌకగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు.. పారిశ్రామిక భూముల బదలాయింపుల పేరుతో కొన్ని నెలలుగా ఈ భూదోపిడీ కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.. ఈ అంశంపై గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల పారిశ్రామిక వాడలో బీఆర్ఎస్ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించారు.. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జీడిమెట్ల పారిశ్రామికవాడలో హిల్ట్ భూ కేటాయింపుల అంశంపై పరిశీలన చేపట్టిన కేటీఆర్, జీడిమెట్ల హమాలీ అడ్డాలో కార్మికులతో మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు శంబిపూర్ రాజు, సునీత రాథోడ్, ఎమ్మెల్యే పళ్ల రాజేశ్వర్ రెడ్డి తదితరులతో కలిసి పలు పరిశ్రమల్లో కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు..

-2లో


---

- కుత్బుల్లాపూర్ హిల్ట్‌పి భూ కేటాయింపు లపై కేటీఆర్ పర్యటనలో దుర్ఘటన..
- న్యూస్ కవరేజ్ చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలిన దామోదర్..
- తొక్కిసలాట, అధిక ఒత్తిడి కారణంగానే అస్వస్థతకు లోనైనట్టు అనుమానాలు..
- అప్పటికప్పుడే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినా ప్రాణాలు దక్కలేదు..
- మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలింపు..
- వీడియో జర్నలిస్టుకు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన కేటీఆర్..

# కేటీఆర్ పర్యటనలో..!

# విషాదం..!

## కుప్పకూలిన "ఆజ్‌తక్" చానల్ సీనియర్ వీడియో జర్నలిస్ట్ దామోదర్ మృతి..



వీడియో జర్నలిస్టు దామోదర్ మృతదేహం వద్ద కేటీఆర్..

-4 లో



# దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్..

# గాగిల్లాపూర్‌లో కూల్చివేతలు..

- గాగిల్లాపూర్‌లో 100 ఫీట్ల మాస్టర్ ప్లాన్ రోడ్డులో అక్రమంగా నిర్మించిన గదులు..
- జీహెచ్ఎంసిలో విలీనమైన దుండిగల్ మున్సిపాలిటీలో "తొలి కూల్చివేతలు"..
- సర్వే నెం.235 భూమి కోర్టు వివాదంలో ఉండగా.!జీహెచ్ఎంసి పర్మిషన్ కూడా లేదు..
- పత్రికల్లో వార్తా కథనాలు, ప్రజల ఫిర్యాదు లతో..టిపిఎస్ క్షేత్రస్థాయి పరిశీలన..
- అక్రమ నిర్మాణాలుగా నిర్ధారించి టౌన్‌ప్లానింగ్ అధికారి సంజునా ఆధ్వర్యంలో చర్యలు..
- కోర్టు వివాదం, ప్రభుత్వ భూములు, పర్మిషన్ లు లేని కట్టడాలపై చర్యలు తప్పవని హెచ్చరిక..
- కూల్చివేతల్లో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకున్నట్లు సమాచారం..

-3 లో

# పారిశ్రామిక భూములతో..! రూ.5 లక్షల కోట్లు భూ కుంభకోణం..!






కేటీఆర్ పర్యటన సందర్భంగా, స్థానికులు ప్లకార్డు ప్రదర్శనతో సంఘీభావం..

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అవినీతికి ప్రతీకగా మారారని విమర్శిస్తూ..! ఢిల్లీకి మూటలు పంపేందుకు రాష్ట్ర ఆస్తులను దోచుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఎవరి ప్రయోజనాల కోసం ఈ భూములను ధారాదత్తం చేస్తున్నారు..? ఎవరి లాభాపేక్ష కోసం ప్రభుత్వ భూములను కొందరికి కట్టబెడుతున్నారు..?" అంటూ కేటీఆర్ ప్రశ్నించారు.. ఈ భూకుంభకోణం ఇప్పటికే బట్టబయలు అయిందని..! ప్రజల్లో చర్చకు దారితీసిందని అన్నారు.. రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణంపై బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తుందని, ప్రజలను ఏకం చేసి, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు.. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై పారిశ్రామికవేత్తలు, కార్మికులు, సామాన్య ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.**

## భూ దోపిడీని.. కార్మిక సంఘాలు ఐక్యతతో అడ్డుకోవాలి:కేటీఆర్..

గురువారం జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో పర్యటించిన కేటీఆర్, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని షాపూర్ ప్రాంతంలో హమాలీలు, కార్మికులతో సమావేశమైన కేటీఆర్, కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్, ప్రభుత్వం చేస్తున్న భూ దోపిడీని కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు ఐక్యతతో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.. ఇప్పటివరకు రూ.5 లక్షల కోట్ల విలువైన భూదోపిడీకి కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు.. ఇది దేశంలోనే అతిపెద్ద భూకుంభకోణమని వ్యాఖ్యానించారు. ప్రజల సొమ్ము ప్రజలకే దక్కాల్సిన అవసరం ఉందని, ప్రజా ఆస్తులను కొందరు కార్పొరేట్‌లకు, ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం అన్యాయమన్నారు..

## ఆషాడం సేల్" మాయలో పడొద్దు: కేటీఆర్ హెచ్చరిక..


కాంగ్రెస్ ప్రభుత్వం ఆషాడం సేల్ లాంటి, ఆఫర్లతో పారిశ్రామిక భూములను విక్రయిస్తోందని, ఈ మాయలో పారిశ్రామికవేత్తలు పడకూడదని కేటీఆర్ సూచించారు.. రేవంత్ రెడ్డి భూకుంభకోణంలో ఎవరూ భాగస్వాములు కావద్దని హెచ్చరించారు.. అక్రమంగా భూములు పొందితే, భవిష్యత్తులో చట్టపరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని, అప్పనంగా భూములు కొనుగోలు చేస్తే, రాబోయే కాలంలో ఇబ్బందులు తప్పవని కూడా సూచించారు.. తమ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమంగా బదలాయించిన పారిశ్రామిక భూములన్నింటినీ తిరిగి స్వాధీన పరచుకుంటామని కేటీఆర్ స్పష్టం చేశారు..

# 61 రోజులు శుభకార్యాలకు బ్రేక్..

**హైదరాబాద్ పెన్ పవర్:** పెళ్లికాని ప్రసాద్‌లకు బ్యాడ్ న్యూస్.. చాలా మంది పెళ్లెప్పుడు అంటే ఏడాది ఆఖరి మాసంలో చేసుకుంటున్నా అంటూ కొంతమంది.. వచ్చే ఏడాది మొదటి నెలలోనే పెళ్లి బాజా పెట్టేస్తా అని మరికొంత మంది చెప్పు కొస్తుంటారు.. అలా చెప్పేవారికి, ఏడాది ఆఖరి మాసంలో, ఏడాది మొదటి మాసంలో వివాహాలు చేసుకునేవారికి ఇది బ్యాడ్ న్యూస్ ...హైందవ సంప్రదాయాల్లో ముహూర్తానికి ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు.. ముహూర్తం నిర్ణయించనిదే ఎటువంటి శుభకార్యక్రమాలకు పూనుకోరు.. తాము తలపెట్టిన పని అంతా సజావుగా, సంతృప్తిగా జరగాలంటే ముహూర్తం చాలా ముఖ్యం అంటుంటారు.. అందుకే ప్రతీ శుభకార్యక్రమాలకు ముహూర్తానికి అంతటి ప్రాధాన్యతనిస్తారు.. సాధారణంగా శుభకార్యాలు నిర్వహించాలంటే గురు బలం బాగా ఉండాలి. అలాగే సిరిసంపదలు, సంతోషాలకు శుక్ర బలం ఎక్కువగా ఉండాలి. అయితే మూఢమి సమయంలో ఈ రెండు గ్రహాలు బలహీనంగా తేజస్సు కోల్పోయి ఉంటాయి.. కాబట్టి ఎలాంటి శుభకార్యాలు నిర్వహించకూడదు అంటుంటారు..అందుకే ఈ మూఢమి ఉన్నన్నాళ్లూ ఎటువంటి శుభకార్యాలకు పూనుకోరు... అందుకే మీ అబ్బాయి పెళ్లెప్పుడు అని గనుక అంటే శూన్య మాసం కదండీ.. మూఢం వెళ్లాక ముహూర్తాలు పెట్టేస్తాం అంటుంటారు..మూఢమి అంటే శూన్యం లేదా చీకటి అని అర్థం. గురుడు లేదా శుక్రడు సూర్యుడితో కలిసి ఉండే కాలాన్ని మౌఢ్యమి అంటారు. దీనినే వాడుక భాషలో ఆయా ప్రాంతాలను బట్టి మూఢమి లేదా మూఢం అని అంటుంటారు. నవగ్రహాల్లోని గురుడు, శుక్రుడు గమనం చేస్తున్న క్రమంలో సూర్యుడికి దగ్గరగా వచ్చినప్పుడు అవి తమ కాంతిని కోల్పోవడం ద్వారా చీకటి లేదా మూఢమి సంభవిస్తుంది. దీనినే శూన్యం అనికూడా అంటుంటారు.. ఇంకా వివరంగా చెప్పాలంటే సౌర కుటుంబానికి సూర్యుడు పెద్దగా చెబుతారు. సూర్యుడి శక్తి, కాంతి అనంతం. అలాగే గురుడు, శుక్రుడు ఇవి రెండూ శుభ గ్రహాలు. ఈ శుభ గ్రహాలు మూఢమి సమయంలో తమ తేజస్సును కోల్పోవడం వల్ల.. చీకటి రోజులుగా భావించి శుభకార్యాలను వాయిదా వేస్తుంటారు. అందుకే ఈ మూఢమి ఉన్నన్ని రోజుల్లో ఎలాంటి శుభకార్యాలు చేయరు.ఈ ఏడాది డిసెంబర్ 8వ తేదీ నుంచి శుక్ర మౌఢ్యమి (గురుడు, శుక్రుడు అస్తంగత్వం) ఏర్పడనుందని పండితులు చెబుతున్నారు. అంటే డిసెంబర్ ఎనిమిది నుంచి 2026 ఫిబ్రవరి 6 వ తేదీ వరకు ఈ శుక్ర మౌఢ్యమి కొనసాగుతుంది. అంటే సుమారు 61 రోజుల

పాటు ఈ మూఢం ఉండనుంది. శ్రీవిశ్వావసు నామ సంవత్సరం మార్గశిర బహుళ చవితి నుంచి మాఘమాసం బహుళ పంచమి వరకు ఈ శుక్ర మౌఢ్యమి కొనసాగుతుంది.. ఈ శుక్ర మౌఢ్యమి లో వివిధ పంచాంగాల్లో గణితాలలో తేడా వల్ల సూర్య గమనానికి దగ్గరగా గురుడు గాని శుక్రుడు గాని రావడం మూలంగా శుక్ర మౌఢ్యమి గాని గురు మౌఢ్యమి గాని ఏర్పడుతుంది. కొంతమంది 12 డిగ్రీలు గాను కొంతమంది 10 డిగ్రీలు గాను కొంతమంది 8 డిగ్రీలు గాను గ్రహించడం వల్ల ఈ తేదీలలో తేడాలు వస్తున్నాయి. కచ్చితంగా భారత ప్రభుత్వ ఆమోదిత దృక్ గణితము గ్రహించడం శాస్త్ర సమ్మతము..కనుక ఈ శుక్ర మౌఢ్యమిలో వివిధ పంచాంగాల్లో వివిధ రకాలుగా డేట్లు రావడం జరిగిందంటున్నారు.ఈ మూఢమి సమయంలో పెళ్లిచూపులు, నిశ్చితార్థం, వివాహం, ఉపనయనం, నూతన గృహప్రవేశం, యజ్ఞాలు, దేవతా విగ్రహ ప్రతిష్ఠలు, వాహనం, ఇల్లు వంటివి కొనడం, బోర్లు వేయించడం, పుట్టువెంట్రుకలు తీయించడం, చెవులు కుట్టించడం, కొత్త వ్యాపారాలు ప్రారంభించడం, తీర్థయాత్రలకు వెళ్లడం,కొత్త ప్రయాణాలు ప్రారంభించడం, పదవీ ప్రమాణ స్వీకారం వంటివి చేయకూడదని పండితులు

చెబుతున్నారు.మూఢమి ఉన్నా యథాతథంగా జరుపుకునే వాటిలో సీమంతం, నూతన వస్త్రాలంకరణ వంటి వాటికి ఈ మూఢమి వర్తించదు. ఈ కార్యక్రమాలకు నమ్మకమైన పండితు లను సంప్రదించి నిర్వహించుకోవచ్చంటున్నారు పండితు లు. అలాగే కొన్ని అనివార్యమైన, నిత్య కర్మలకు ఈ మూఢమి దోషం వర్తించదు. వాటిలో ప్రధానంగా రోజువారీ ప్రయాణాలు, నిత్యపూజ, అభిషేకం, నవగ్ర హ శాంతి, సీమంతం, నామకరణం, అన్నప్రాశన వంటి కార్యక్రమాలు, చాతుర్మాస్య వ్రతాలు వంటివి ఈ శుక్ర మౌఢ్యమి రోజుల్లో వచ్చినా కూడా నిరభ్యంతరంగా చేసుకోవచ్చంటున్నారు.




- గాగిల్లాపూర్‌లో 100 ఫీట్ల మాస్టర్ ప్లాన్ రోడ్డులో అక్రమంగా నిర్మించిన గదులు..
- జీహెచ్‌ఎంసిలో విలీనమైన దుండిగల్ మున్సిపాలిటీలో "తొలి కూల్చివేతలు"..
- సర్వే నెం.235 భూమి కోర్టు వివాదంలో ఉండగా.!జీహెచ్‌ఎంసి పర్మిషన్ కూడా లేదు..
- పత్రికల్లో వార్తా కథనాలు, ప్రజల ఫిర్యాదు లతో..టిపిఎస్ క్షేత్రస్థాయి పరిశీలన..
- అక్రమ నిర్మాణాలుగా నిర్ధారించి టౌన్‌ప్లానింగ్ అధికారి సంజునా ఆధ్వర్యంలో చర్యలు..
- కోర్టు వివాదం, ప్రభుత్వ భూములు, పర్మిషన్ లు లేని కట్టడాలపై చర్యలు తప్పవని హెచ్చరిక..
- కూల్చివేతల్లో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకున్నట్లు సమాచారం..

గాగిల్లాపూర్ సర్వే నెం.235 వివాదాస్పద భూమిలో అక్రమ నిర్మాణాలు కూల్చేతలు..

# దుండిగల్ జీహెచ్‌ఎంసి సర్కిల్..
# గాగిల్లాపూర్‌లో కూల్చివేతలు

## వివాదాస్పద భూమిలో..! అనుమతుల్లేని కమర్షియల్ అక్రమ నిర్మాణాలు..

### అటు హైకోర్టు పరిధిలో..! ఇటు జీహెచ్‌ఎంసి అనుమతుల్లేవు..!

ఓవైపు హైకోర్టు పరిధిలో ఉన్న వివాదాస్పద భూమి.. మరోవైపు ఎలాంటి నిర్మాణ అనుమతులు లేకుండానే పెద్ద ఎత్తున వ్యాపారాత్మక షెడ్లు నిర్మించి గదులుగా మారుస్తూ అద్దెకు ఇవ్వడానికి ప్రయత్నాలు జరిగినట్లు స్థానికుల ఆరోపణలతో, ప్రజలు ఫిర్యాదులు జీహెచ్‌ఎంసి దృష్టికి వచ్చాయని.
దీంతో దుండిగల్ సర్కిల్‌కు చెందిన అధికారులు స్థలాన్ని పరిశీలించి, కోర్టు కేసులో ఉన్న భూమిపై అనుమతుల్లేని నిర్మాణాలుగా నిర్ధారించారు. అనంతరం జేసీబీ యంత్రాల సహాయంతో అక్రమంగా నిర్మించిన గదులను కూల్చివేసినట్టు టౌన్‌ప్లానింగ్ అధికారి టిపిఎస్ సంజునా తెలిపారు.."కోర్టు వివాదంలో ఉన్న భూములు, ప్రభుత్వ భూముల్లో, నిర్మాణాలు పూర్తిగా నిషేధం అంటూ టిపిఎస్ హెచ్చరించారు.. మరోవైపు అనుమతులు కూడా లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవనితప్పవని టిపిఎస్ సంజునా హెచ్చరించారు..

దుండిగల్, పెన్ పవర్, డిసెంబర్ 4:దుండిగల్ మున్సిపాలిటీని, జీహెచ్‌ఎంసిలో విలీనం చేసిన తొలిరోజే, కోర్టు కేసులో ఉన్న ఓ వివాదాస్పద భూమిలో, అక్రమంగా నిర్మించిన కమర్షియల్ నిర్మాణాలను దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం కూల్చేశారు.. దుండిగల్ జీహెచ్‌ఎంసి సర్కిల్ పరిధిలోని గాగిల్లాపూర్ సర్వే నెం.235 వివాదాస్పద భూమిలో అక్రమంగా నిర్మించిన, గదుల కూల్చివేతల్లో స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.. జీహెచ్‌ఎంసి అనుమతులు తీసుకోకుండా, ఓవైపు కోర్టు కేసులో ఉన్న భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులు..! మరోవైపు హెచ్‌ఎండిఏ 100 ఫీట్ల మాస్టర్ ప్లాన్ రోడ్డులో నిర్మించన గదులపై,



టౌన్‌ప్లానింగ్ అధికారితో నిర్మాణ దారులు వాదన, స్వల్ప ఉద్రిక్తత..



దుండిగల్ జీహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు.. అక్రమంగా నిర్మించిన గదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్రమ నిర్మాణాలుగా నిర్ధారించుకుని కూల్చివేతలు జరిపినట్లు తెలిపారు.. గాగిల్లాపూర్ సర్వే నెం. 235 89/2023, 69/2024, 74/2024, 324/2024 కేసులు నమోదు కాగా..! ఈ భూమికి సంబంధించి డబ్ల్యు.పి. నెం. 28044/2024, 14557/2024, 28044/2024 కేసులు న్యాయస్థానంలో విచారణలో ఉన్నట్లు తెలుస్తుంది..



వీడియో జర్నలిస్టు దామోదర్ మృతదేహం వద్ద కేటీఆర్..

ఆజ్‌తక్ చానల్ వీడియో జర్నలిస్టు దామోదర్.. ఫైల్‌ఫోటో..

# కేటీఆర్ పర్యటనలో..! విషాదం..!

## కుప్పకూలిన “ఆజ్‌తక్” చానల్ సీనియర్ వీడియో జర్నలిస్ట్ దామోదర్ మృతి..

- కుత్బుల్లాపూర్ హిల్ట్‌పి భూ కేటాయింపు లపై కేటీఆర్ పర్యటనలో దుర్ఘటన..
- న్యూస్ కవరేజ్ చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలిన దామోదర్..
- తొక్కిసలాట, అధిక ఒత్తిడి కారణంగానే అస్వస్థతకు లోనైనట్టు అనుమానాలు..
- అప్పటికప్పుడే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినా ప్రాణాలు దక్కలేదు..
- మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలింపు..
- వీడియో జర్నలిస్టుకు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన కేటీఆర్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో/కుత్బుల్లాపూర్, పెన్ పవర్, డిసెంబర్ 4:** హిల్ట్‌పి భూ కేటాయింపు అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో చేపట్టిన పర్యటనలో విషాదం చోటుచేసుకుంది.. కేటీఆర్ పర్యటనను కవర్ చేసేందుకు వచ్చిన తెలంగాణ సీనియర్ వీడియో జర్నలిస్ట్, “ఆజ్‌తక్” ప్రతినిధి దామోదర్ అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందారు. గుండెపోటు కారణంగా ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు వైద్యులు భావించారు.. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జీడిమెట్ల పారిశ్రామికవాడలో హిల్ట్ భూ కేటాయింపుల అంశంపై పరిశీలన చేపట్టిన కేటీఆర్, హమాలీ అడ్డాలో కార్మికులతో మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు శంబిపూర్ రాజు, సునీత రాథోడ్, ఎమ్మెల్యే పళ్ళ రాజేశ్వర్ రెడ్డి తదితరులతో కలిసి పలు పరిశ్రమల్లో కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా న్యూస్ కవరేజ్ విధుల్లో ఉన్న వీడియో జర్నలిస్ట్ దామోదర్, పార్టీ నేతలు మరియు కార్యకర్తల అత్యుత్సాహం, సెల్ఫీల బెడదతో ఏర్పడిన తొక్కిసలాటలో ఒక్కసారిగా అస్వస్థతకు లోనై కుప్పకూలిపోయారు. అక్కడే ఉన్న తోటి రిపోర్టర్లు, గన్‌మెన్‌లు మరియు జీడిమెట్ల పోలీసుల సహకారంతో దామోదర్‌ను హుటాహుటిన షాపూర్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.. ఆ సమయంలో దామోదర్‌కు వాంతులు రావడంతో పాటు బ్లడ్ ప్రెషర్(బిపి) అధిక స్థాయికి చేరి, తీవ్ర ఒత్తిడికి లోనైనట్లు వైద్యులు తెలిపారు. వైద్యులు ఎంత ప్రయత్నించినప్పటికీ చికిత్స పొందుతూ దామోదర్ తుదిశ్వాస విడిచారు.సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు ఘటనపై వివరాలు సేకరించి, దామోదర్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు..

### కుటుంబ సభ్యులను పరామర్శించిన కేటీఆర్.. “

తెలంగాణ సీనియర్ వీడియో జర్నలిస్ట్ దామోదర్ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమం ప్రారంభ దశ నుంచే దామోదర్ ఉద్యమ వార్తల కవరేజ్‌లో చురుకుగా పాల్గొన్నారని గుర్తు చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.. కేటీఆర్ గాంధీ ఆస్పత్రిలో దామోదర్ మృతదేహానికి నివాళులు అర్పించారు. దామోదర్ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. వీడియో జర్నలిస్ట్ దామోదర్ అకాల మరణంతో తెలంగాణ జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి..





మృతుడు దామోదర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేటీఆర్..

## హిడ్మా ఎన్కౌంటర్పై మావోయిస్టుల మరో లేఖ

**హైదరాబాద్ పెన్ పవర్:**హిడ్మా ఎన్కౌంటర్పై మావోయిస్టులు మరో లేఖ కు విడుదల చేసారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ పేరిట ప్రకటన విడుదల చేసారు. హిడ్మా, శంకర్లను ఎన్కౌంటర్ చేయలేదు. ఇది పూర్తిగా భూటకపు హత్య అని ఆరోపించారు. పట్టుకుని వారం రోజులు చిత్రహింసలు పెట్టి చంపేశారు. ఏపీకి చెందిన కలప వ్యాపారుల ద్రోహంతో పట్టుబడ్డారని వెల్లడించారు. అనారోగ్యంతో ఉన్న హిడ్మా, శంకర్లు చికిత్స కోసం విజయవాడకు వెళ్తుండగా అరెస్ట్ చేసారు. కలప వ్యాపారులు, పోలీసులతో కలిసి కుట్రలు వేశారని ఆరోపించారు. ఆంధ్ర పోలీసులు కస్టడీలో హతమార్చారు . హిడ్మా,
శంకర్ల ఎన్కౌంటర్ పై సమగ్ర దర్యాప్తు చేయాలని మావోయిస్టుల డిమాండ్ చేసారు.

## వీధి కుక్కలు వెంబడించడంతో బైకుపై నుండి పడి యువకుడు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:**వీధి కుక్కలు వెంబడించడంతో బైకుపై నుండి పడి యువకుడు మృతి చెందారు. గీసుగొండ మండలం మచ్చాపూర్ గ్రామంలో, హన్మకొండలో ఉద్యోగం ముంగించుకుని వస్తున్న ఎలుకుర్తి గ్రామానికి చెందిన ఆడెపుశివకుమార్(24) అనే యువకుడిని వీధి కుక్కలు వెంబడించాయి. దీంతో కుక్కల నుండి తప్పించుకునేందుకు శివకుమార్ వేగంగా వాహనం నడిపి అదుపుతప్పి డ్రైనేజీలో పడి మృతి చెందాడు. రాష్ట్రంలో వీధి కుక్కల
వల్ల రోజుకో ప్రాణం పోతున్నా, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు.

## గొప్ప నాయకుల జీవితం మనందరికీ ఆదర్శం

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**హైదరాబాద్ పెన్ పవర్:**గొప్ప నాయకుల జీవితం మనందరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో దివంగత ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కొణిజేటి రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక శాఖ మంత్రిగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి వైయస్సార్ హయాంలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారని, ఆర్థిక శాఖ తో పాటు రోడ్లు భవనాల రవాణా శాఖ మంత్రిగా హౌసింగ్ శాఖ మంత్రిగా,విద్యుత్ శాఖ మంత్రిగా హోమ్ మినిస్టర్, వైద్య ఆరోగ్యం, విద్యాశాఖ మంత్రిగా కూడా కొంతకాలం తన సేవలు అందించారని, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సేవలు అందించారని, అనంతరం తమిళనాడు గవర్నర్ గా పని చేశారని తెలిపారు.మహనీయుల ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బి. ఎస్ లత, రాజ గౌడ్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ గురు దత్తాత్రేయ జయంతి వేడుకలు...

**హైదరాబాద్ పెన్ పవర్:**:శ్రీ భక్త మార్కండేయ దేవాలయములో గత వారం రోజుల నుండి భక్తిశ్రద్ధలతో శ్రీ గురు దత్తాత్రేయ చరిత్ర పారాయణాన్ని భక్తులు మహిళలు సామూహికంగా దత్త పారాయణాన్ని నిర్వహించారు.ఈరోజుతో ముగియడంతో కలశ ఉద్వాసన పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గురు దత్తాత్రేయ స్వామి జయంతిని పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం శ్రీ గురు దత్తాత్రేయ స్వామి వారికి పంచాముతాభిషేకాలను, ప్రత్యేక పూజలను నిర్వహించి పలు పుష్పాలతో చక్కగా అలంకరించి మంగళహారతులను సమర్పించారు. ఈ పూజా కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు మేడిపల్లి శ్రీనివాస శర్మ, జన మంచి సత్యనారాయణ శర్మ నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ గురు దత్తాత్రేయ స్వామి వారికి భక్తుల స్వహస్తాలతో పంచామృతాభిషేకాలను



నిర్వహించారు. అనంతరం ఆలయంలోని శ్రీ గాయత్రి అమ్మవారిని శ్రీ భక్త మార్కండేయ స్వామి వారిని శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్నారు.విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాలను అందజేసి అన్నప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు బోగ గంగాధర్, ఆలయ ప్రధాన కార్యదర్శి గాదాసు రాజేందర్ బోగ రాజు, మానపురి మహేష్, కొక్కుల ప్రభాకర్, కార్యవర్గం సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ భద్రతతో కూడిన ఎంటీఎస్ ను అమలు చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** సిఆర్ఎంటి లకు ఉద్యోగ భద్రతతో కూడిన ఎంటీఎస్ ను అమలు చేయాలని,పెరిగిన ధరలకు అనుగుణంగా సిఆర్ఎంటి ల అర్హతలను దృష్టిలో ఉంచుకొని సిఆర్ఎంటి లకు రూ 44570/- వేతనము చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ సిఆర్ఎం టీచర్స్ యునైటెడ్ ఫోరం రాష్ట్ర నాయకులు పుల్లన్న , మండల నాయకులు ఉరుకుందు లు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన నందవరం మండల విద్యాధికారి కార్యాలయము ముందు సిఆర్ఎంటి లు “ఆత్మగౌరవ దీక్ష “కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారులు (1,2 )గోవిందు, రఘునాథ్ , మరియు తహసిల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రమును అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉన్న అన్ని అర్హతలు సిఆర్ఎంటి లకు ఉన్నందున డీఎస్సీ నందు వారికి వెయిటేజ్ ఇవ్వాలని, అదేవిధంగా 2011 నుండి అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నామని కావున తమకు ఎంటిఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షలో 14 సంవత్సరాలుగా విద్యావ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూ ఇటు మండల విద్యాధికారులకు,అటు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు సమన్వయకర్తగా పనిచేస్తూ ప్రభుత్వం చేపడుతున్న 38 రకాల సేవలను అందిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. సిఆర్ఎంటి లకు అదనపు పని భారాన్ని తగ్గించి, వివిధ జిల్లాలలో ఖాళీగా ఉన్న సిఆర్ఎంటి పోస్టులను భర్తీ చేయాలన్నారు. 9



సంవత్సరాలుగా ఏ విధమైన వేతనం పెంపుదల లేకుండా 2016 సంవత్సరంలో పిఏబి ఆమోదించిన 23,500/- వేతనాలుగా చెల్లిస్తున్నందువలన పెరిగిన అధిక ధరలతో కుటుంబ పోషణ కష్టతరంగా మారిందన్నారు. కావున తక్షణమే వేతనాలు పెంపుదల చేయాలన్నారు. జీవో ఎంఎస్ నెంబర్ 65 ప్రకారము 4034 సిఆర్ఎంటి లు స్కూల్ అసిస్టెంట్ అర్హతలతో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ బేసిక్ వేతనం 44570/- ల తో రాష్ట్ర పిఆర్సి నీ అనుసరించి ఎంటిఎస్ ను అమలు చేయాలన్నారు. అదేవిధంగా సిఆర్ఎంటి లకు ప్రభుత్వము నిర్దిష్ట జాబ్ చార్ట్ అమలు చేయాలన్నారు. విద్యాశాఖలో విలీనం చేయాలనీ, సిఆర్ఎంటిలు ఫీల్డ్ లెవల్లో పనిచేస్తున్నందున ట్రావెలింగ్ అలవెన్స్ లను పునరుద్ధరించాలన్నారు. పాఠశాల విద్య, సమగ్ర శిక్ష లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ అర్హతలతో పనిచేస్తున్న సిఆర్ఎంటి లకు డీఎస్సీలో వెయిటేజ్ కల్పించాలన్నారు. పదవీ విరమణ వయసు 60 ఏళ్ల నుండి 62 ఏళ్లకు పెంచుతూ, పదవీ విరమణ తర్వాత వారికి గ్రాట్యుటీ ఇతర రిటర్మెంట్ బెనిఫిట్స్ ను అందించాలన్నారు. ఇతర ఉద్యోగులకు వర్తించే ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు. సిఆర్ఎంటిలు
ఎవరైనా అనారోగ్యంతో గాని, ప్రమాదవశాత్తు కానీ మరణిస్తే ఎక్స్ గ్రేషియా 10 లక్షలు మరియు ఆ కుటుంబంలో అర్హులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారి న్యాయమైన కోరికలను ప్రభుత్వము పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8వ తేదీన జిల్లా కలెక్టరేట్ల వద్ద, డిసెంబర్ 22వ తేదీన విజయవాడ నందు పెద్ద ఎత్తున జరుగు ఆత్మ గౌరవ దీక్ష “ను ప్రతి సిఆర్ఎంటి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్ఎంటిలు పుల్లన్న, ఉరుకుందు, అనిల్ కుమార్, మహేశ్వరి లు పాల్గొన్నారు.

# వలస కార్మికుల పిల్లల చదువును ప్రోత్సహిస్తాం

**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లాలోని వలస కార్మికుల పిల్లల చదువును ప్రోత్సహిస్తామని, ఇందుకోసం జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో వారికి ప్రత్యేక తరగతి గదులను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు.

గంగాధర మండలం గట్టుభూత్కూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వలస కార్మికుల పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తరగతి గదిని కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఇక్కడ 42 మంది వలస కార్మికుల పిల్లలని గుర్తించి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు.

ఈ సందర్భంగా తరగతి గదిలోని చిన్నారులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వివిధ భాషల్లో పలుకరించి చదువు, స్వస్థలం, కుటుంబ సభ్యుల వివరాల వంటివి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వలస కార్మికుల పిల్లలందరినీ గుర్తించి వారికి సమీప పాఠశాలల్లో ప్రత్యేక తరగతి గదిలో విద్యా బోధన చేస్తున్నామని తెలిపారు. గత ఏడాది సుమారు 500 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్చి చదువు చెప్పించామని అన్నారు. ఈ సంవత్సరం కూడా మరిన్ని పాఠశాలల్లో ఈ పిల్లల కోసం ప్రత్యేక తరగతి గదులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పాఠశాలకు వచ్చే పిల్లలందరికీ మధ్యాహ్న భోజనం, పోషకాహారం అందిస్తామని తెలిపారు. ప్రత్యేక మెడికల్ క్యాంపు ల ద్వారా వారి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తామని అన్నారు. వలస కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసే



పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇటుక బట్టీల యజమానులతో మాట్లాడి పాఠశాల వరకు రవాణా సదుపాయం ఉండేలా చూడాలని సూచించారు.

కార్మికుల పిల్లలు వివిధ రాష్ట్రాల నుండి వస్తున్నందున వారికి ఇంగ్లీషులో బోధన చేయాలని సూచించారు. గణితం ఇంగ్లీషు సబ్జెక్టులను ముఖ్యంగా బోధించాలని విద్యా వాలంటీర్లను ఆదేశించారు. దీనివల్ల వారు భవిష్యత్తులో ఏ రాష్ట్రానికి వెళ్లినా ఉపయోగపడుతుందని అన్నారు. కార్మికుల పిల్లలకు అవసరమైన యూనిఫాం, పుస్తకాలు, నోట్ బుక్కులు వంటివి అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పూర్వ ప్రాథమిక పాఠశాల సందర్శన:

విద్యాశాఖ ఆధ్వర్యంలో గట్టుబూత్కూరు మండల ప్రాథమిక పాఠశాలలోని పూర్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఇక్కడ పూర్వ ప్రాథమిక విద్య అభ్యసిస్తున్న పిల్లలతో మమేకమయ్యారు. ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని, ఇందుకోసం ప్రభుత్వం నుండి వచ్చిన అన్ని ఆట వస్తువులను, పుస్తకాలను వినియోగించాలని సూచించారు. పూర్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెంచాలని అన్నారు.

కలెక్టర్ వెంట తహసిల్దార్ రజిత, మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు తదితరులు ఉన్నారు.

# రవీంద్ర భారతిలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4 వ వర్ధంతి సబ

**హైదరాబాద్ పెన్ పవర్:**

మాజీ ముఖ్యమంత్రి రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పించిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,మంత్రి పొన్నం ప్రభాకర్

ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ దయానంద్,కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్, జగ్గారెడ్డి,మాజీ మంత్రి వెన్నెంపల్లి శ్రీనివాస్, ఆమంచి కృష్ణ మోహన్, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత,టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా,ఇతర ముఖ్య నేతలు.

రోశయ్య గారి వర్ధంతి సందర్భంగా వి. హనుమంతరావు సత్కరించిన రోశయ్య మెమోరియల్ ట్రస్ట్.రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పేద విద్యార్థులకు స్కాలర్ షిప్ అందించిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,మంత్రి



పొన్నం ప్రభాకర్.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.

మాజీ ముఖ్యమంత్రి,మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 4 వ వర్ధంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పిస్తున్న.రోశయ్య ఆజానుబాహులు ఆయన మాటల్లోనూ వ్యక్తిత్వంలో ఆచరణలో ఈనాటి తరానికి స్ఫూర్తి.

వారిని ఆదర్శంగా తీసుకొని ఏ విధంగా ఓపికగా ఉండాలి,కింది స్థాయి నుండి రాజకీయాల్లోకి వచ్చి ఎలా ఎదగవచ్చు ఆయన ప్రత్యక్ష నిదర్శనం.

రోశయ్య దగ్గర సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీలో అనేక సంవత్సరాలు కలిసి పనిచేశాను. ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు నేను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నాను ఆయన తో కలిసి అనేక సమావేశాల్లో పాల్గొని చూసి నేర్చుకునే అవకాశం దక్కింది.వారి ప్రసంగాలు సబ్జెక్ట్ వరకే పరిమితమయ్యేలా పరిణితి పొంది ఉండేది.రోశయ్య జీవిత చరిత్ర నుండి ఆర్థిక క్రమశిక్షణ నేర్చుకోవాలి.

## యాసిడ్ దాడి కేసులపై సుప్రీంకోర్టు షాక్

**హైదరాబాద్ పెన్ పవర్:**యాసిడ్ దాడి కేసులపై సుప్రీంకోర్టు షాక్ వ్యక్తం చేసింది. దేశ్యాప్తంగా యాసిడ్ దాడి కేసుల పెండింగ్ వివరాలను వెల్లడించాలని అన్ని హైకోర్టులకు సుప్రీంకోర్టు ఇవాళ ఆదేశం జారీ చేసింది. నాలుగు వారాల్లోగా ఆ సమాచారాన్ని ఇవ్వాలని చెప్పింది. ఢిల్లీలో రోహిణి కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఓ యాసిడ్ దాడి కేసును సుప్రీం విచారిస్తూ ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. 16 ఏళ్లుగా యాసిడ్ దాడి కేసులో విచారణ జరగడం సిగ్గుచేటు అని ధర్మాసనం చెప్పింది. చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయమాలా బాగ్చితో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. యాసిడ్ దాడి బాధితురాలు షాహీన్ మాలిక్ దాఖలు చేసిన పిటీషన్‌పై సుప్రీం ధర్మాసనం తన షాక్‌ను వ్యక్తం చేసింది.షాహీన్ మాలిక్ కేసులో సుప్రీం స్పందిస్తూ.. 2009 నుంచి ఆ కేసు రోహిణి కోర్టులో ఉందని, ఇది న్యాయ వ్యవస్థను పరిహాసం చేయడమే అవుతుందని ధర్మాసనం చెప్పింది. ఇది చాలా సిగ్గుచేటు అంశమని, దేశ రాజధానిలో ఓ కేసు ఇంత కాలం పెండింగ్‌లో ఉంటే, మరి ఎవరు దీన్ని పరిష్కరిస్తారని, ఇది నిజంగా దేశానికే సిగ్గుచేటు అని సుప్రీం ధర్మాసనం తెలిపింది. ప్రభుత్వ పథకాలను పొందేందుకు యాసిడ్ బాధితులను దివ్యాంగులుగా గుర్తించాలని మాలిక్ చేసిన అభ్యర్థనను కేంద్రం పరిశీలించాలని సుప్రీం ధర్మాసనం చెప్పింది. అయితే ఈ అంశాన్ని సీరియస్‌గా పరిశీలించనున్నట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. దివ్యాంగుల క్యాటగిరీలో యాసిడ్ దాడి బాధితుల్ని చేర్చేందుకు చట్టాన్ని సవరించాలని కేంద్రాన్ని సీజేఐ కోరారు.

## భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై 63 మంది వ్యక్తులపై కేసు నమోదు.

**హైదరాబాద్ పెన్ పవర్:**గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున, ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా సమావేశం నిర్వహించి, ఓటర్లను ప్రలోభానికి గురిచేసినందుకు గాను, సిద్దిపేట జిల్లా భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో మొత్తం 63 మంది వ్యక్తులపై భూంపల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగినది.

3/12/2025 నాడు అందిన నమ్మదగిన సమాచారం మేరకు, భూంపల్లి ఎస్సై హరీష్ తో పాటు సిబ్బంది కానిస్టేబుల్ ప్రవీణ్, సంతోష్, మహిళా కానిస్టేబుల్ వినీత, మరియు హొంగార్డ్ తుకారం తో కలిసి తాళ్లపల్లి గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న పెద్దమ్మ గుడి వద్దకు వెళ్లాగా అక్కడ తాళ్లపల్లి గ్రామస్తులు కొంతమంది ఒక సమావేశం నిర్వహించినట్లు గుర్తించారు. గ్రామ పంచాయితీ ఎన్నికలలో ఒకే కులం నుండి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఐదుగురు వ్యక్తులు నీల ప్రభాకర్, గోపరి యాదగిరి, గోపరి కనకరాజు,గోపరి శ్రీకాంత్, వెల్పుల యేసు లలో ఎవరైతే పెద్దమ్మ గుడి నిర్మాణానికి ఎక్కువ డబ్బులు ఇస్తారో, వారికి వారి కులస్తులు అందరూ ఓటు వేయాలని తీర్మానం చేయడానికి కులపెద్దమనుషులు మాట్లాడుకుంటున్నట్లు తెలియడంతో

గ్రామ పంచాయితీ ఎన్నికలు జరుగుతున్నందున, ఎన్నికలు జరిగే అన్ని ప్రాంతాలలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎం సిసి అమలులో ఉంది. ఈ నిబంధనలు అమలులో ఉన్నప్పటికీ, గ్రామస్తులు ఎటువంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా సమావేశం నిర్వహించడం, మరియు ఓటు వేయడానికి డబ్బులు ఇవ్వాలనే అంశాన్ని చర్చించి, ఓటర్లను ప్రలోభానికి గురిచేయడం స్పష్టంగా చట్ట వ్యతిరేకం అని సబ్ ఇన్స్పెక్టర్ ఇచ్చిన సమోటో పిటిషన్ పై సమావేశంలో పాల్గొన్న కుల సంఘం పెద్దమనుషులు ఇద్దరు, ఐదుగురు సర్పంచ్ అభ్యర్థులు మరియు 56 మంది సభ్యులు సహా మొత్తం 63 మందిపై భూంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగింది. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం లేదా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే చర్యలను ఉపేక్షించేది లేదని, ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము.

## పారిశుద్ధ కార్మికురాలుకు జనసైనికులు ఆర్థిక సహాయం



**హైదరాబాద్ పెన్ పవర్:**దేవనకొండ గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్నటువంటి పారిశుద్ధ కార్మికురాలు అయినటువంటి హరిజనవాడకు చెందిన పి అంజలి గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యల కారణంగా నిన్న మరణించడం జరిగినది. గ్రామంలోని జనసేన నాయకులు ఆమె పార్టీ వ దేహాన్ని సందర్శించి సంతాపం తెలియజేసి, ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని చెప్పి తమ వంతుగా 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బోయ సరోజమ్మ, జనసేన నాయకులు కటిక ఉచ్చురప్ప, భూసల రామాంజనేయులు, బొడ్డు నాగరాజు, బంగి బాలు, పరమేష్, రమేష్ ,సతీష్, ఖలీల్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం రోశయ్య వర్ధంతి



**రాజన్న సిరిసిల్ల: పెన్ పవర్:**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య వర్ధంతిని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా యువజన అండ్ క్రీడల శాఖ అధికారి రాందాస్, ఏవో రాంరెడ్డి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ పరిశీలన



**హైదరాబాద్ పెన్ పవర్:**

రాజన్న సిరిసిల్ల వేములవాడ అర్బన్ మండలం అనుపురం, బోయినిపల్లి మండలం మానువాడలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 గా నిర్ణయించిందని తెలిపారు. రైతులు తమ సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో బోయినిపల్లి తహసీల్దార్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే తన కార్యకలాపాలను విస్తరించేందుకు మహిళలతో ఉగ్రవాద గ్రూప్

**హైదరాబాద్ పెన్ పవర్:**
పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే తన కార్యకలాపాలను విస్తరించేందుకు మహిళలతో ఓ ఉగ్రవాద గ్రూప్ ను తయారుచేస్తున్న విషయం తెలిసిందే. మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ మహిళా గ్రూపుకు నేతృత్వం వహిస్తున్నారు. 'జమాతుల్-ముమినాత్' పేరుతో ఓ ప్రత్యేక యూనిట్‌ను తయారు చేస్తున్నది. అయితే, కొద్ది వారాల వ్యవధిలోనే వేల సంఖ్యలో మహిళల్ని ఆకర్షించినట్లు తేలింది. ఈ విషయాన్ని స్వయంగా మసూద్ అజారే సోషల్ మీడియా వేదికగా వెల్లడించడం గమనార్హం.ఉగ్రవాద సంస్థ మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోందని జైష్ చీఫ్ మసూద్ అజార్ అందులో పేర్కొన్నారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. 'జైషే మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోంది. చాలా తక్కువ సమయంలోనే 5,000 మందికిపైగా మహిళలు చేరారు. ఇదంతా అల్లా దయ వల్లే జరిగింది. చాలా మంది సోదరీమణులు నియామకం పొందిన వెంటనే తమ మానస్థిక స్థితిమారిపోయినట్లు చెబుతున్నారు. జీవిత లక్ష్యాన్ని గ్రహించినట్లు చెప్పారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి జిల్లాకు ఒక ముంటాజియా (మేనేజర్) ఉంటారు' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.కాగా, పలు నివేదికల ప్రకారం.. జమాతుల్-ముమినాత్ కోసం నియామక డ్రైవ్ ఈ ఏడాది అక్టోబర్ 8న జైషే ప్రధాన కార్యాలయం మర్కజ్ ఉస్మాన్-ఓ-అలీలో ప్రారంభమైంది. ఈ డ్రైవ్‌లో భాగంగా పాక్‌లోని బహవల్‌పూర్, ముల్తాన్, సియాల్‌కోట్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లి నుంచి మహిళలను ఉగ్రవాద సంస్థలోకి చేర్చుకున్నారు. ఈ సంస్థ రూ.500 ఫీజుతో 40 నిమిషాలు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తూ.. మహిళల్ని ఉగ్రవాదం వైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఐఎస్ఐఎస్, హమాస్, ఎల్‌టీటీఈ తరహాలో ఫిదాయిన్ (ఆత్మాహుతి) దాడులు నిర్వహించడానికి ఈ మహిళలతో ఉగ్రవాద బ్రిగేడ్‌లను ఏర్పాటు చేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది.

# సిసీయర్ జర్నలిస్ట్...హనీ ట్రాప్

## సీఎంవో లో ఇంటి దొంగలు

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణ ప్రభుత్వంలో అత్యంత కీలక నిర్ణయాలు ముందుగానే బీఆర్ఎస్ పార్టీకి చేరుతున్నాయి. చాలా రోజుల నుంచి ప్రభుత్వ పెద్దలకు ఈ అంశంపై అనుమానాలు ఉన్నా.. హిల్ట్ పాలసీ గురించి పూర్తి స్థాయిలో కేబినెట్‌కు కూడా వివరాలు తెలియక ముందే.. బీఆర్ఎస్‌కు తెలిసిపోవడంతో కోవర్ట్ చాలా ఉన్నత స్థాయిలోనే ఉన్నారని క్లారిటీ వచ్చింది. ఈ అంశంపై విజిలెన్స్ దర్యాప్తు చేసిది. నివేదికను సిద్ధం చేసింది. ఆ నివేదికను సీఎం వద్ద ఉంచారు చీఫ్ సెక్రటరీ.హిల్ట్ పాలసీ గురించి ప్రభుత్వం చాలా అత్యున్నత స్థాయిలో కసరత్తు చేసింది. కేబినెట్ లో నిర్ణయం తీసుకోవాలనుకునేవరకూ మంత్రులకు కూడా తెలియదు. విధివిధానాలు అన్నీ కసరత్తు చేసి డ్రాఫ్ట్ గా నోట్ తయారు చేసుకున్నారు. అయితే ఆ దశలోనే బీఆర్ఎస్ వద్దకు సమాచారం చేరిపోయింది. ప్రభుత్వం ఎవరికీ తెలియదనుకుంటున్న సమయంలోనే హిల్ట్ పాలసీ గురించి కేటీఆర్ ప్రెస్ మీట్ పెట్టి ఐదు లక్షల కోట్ల స్కాం అని ఆరోపణలు చేశారు. దీంతో ఆశ్చర్యపోవడం ప్రభుత్వ పెద్దల వంతు అయింది. అనుకున్నంత తేలికగా రాజకీయం లేదని తమ వద్దనే బీఆర్ఎస్ కోవర్టులు ఉన్నారని గుర్తించారు. అసలు కోవర్ట్ ఎవరో కాంగ్రెస్ పెద్దలకు తెలిసిపోయిందని చెబుతున్నారు. ఆయనను సీఎం రేవంత్ రెడ్డి ఎంతో నమ్మారని చెబుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జర్నలిస్టుగా ఉన్న ఆయన సిన్సియారిటీని రేవంత్ నమ్మారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోట లాంటి జిల్లా నుంచి వచ్చిన ఆయనకు నామినేటెడ్ పదవిని చాలా ముందుగానే ప్రకటించారు. సీఎంతో నిత్యం సమావేశాల్లో పాల్గొనేంత కీలక పదవి ఇచ్చారు. తర్వాత రాజ్యాంగబద్దమైన పదవి ఇచ్చారు. పదవి ఏదైనా తనకు ఉన్న చనువుతో కీలక విషయాలను తెలుసుకునేవారు . వాటిని గుట్టుచప్పుడు కాకుండా.. బీఆర్ఎస్ పార్టీ పెద్దలకు పంపుతున్నారు. హిల్ట్ పాలసీ కి సంబంధించిన డాక్యుమెంట్లు కూడా ఇలా ఫార్వార్డ్ అయ్యాయని చెబుతున్నారు. కేటీఆర్ వాటిని చూపించే ముందే ప్రెస్ మీట్ పెట్టారు.సాధారణంగా అధికారుల స్థాయిలో సమాచారం లీక్ అవుతుంది. కానీ అధికారులు ఎలాంటి డాక్యుమెంట్లు ఫార్వార్డ్ చేయరు. అలాంటి రిస్క్ తీసుకోలేరు. నోటిమాటగా సమాచారం ఇవ్వగలరు. కానీ హిల్ట్ పాలసీ విషయంలో డాక్యుమెంట్లు కూడా బీఆర్ఎస్ ముఖ్యనేతలకు షేర్ అయ్యాయని విజిలెన్స్ గుర్తించింది. ఆయన ఎవరో కూడా కనిపెట్టారు. ప్రభుత్వం ఏర్పడగానే ఆయనకు మీడియా విభాగంలో కీలక బాధ్యతలు ఇచ్చారు. తర్వాత రాజ్యాంగ బద్దమైన పదవి కూడా ఇచ్చారు. ఆయన వివిధ పాలసీల విషయంలో మీడియాతో డీల్ చేయాల్సిన వ్యూహాలను ఖరారు చేస్తున్నారని అంటున్నారు. ఆయన నుంచే లీక్ అయిందని..సీఎం రేవంత్ రెడ్డి నమ్మకాన్ని ఆయన పూర్తిగా వమ్ము చేశాడని అంటున్నారు. ఇది చిన్న విషయం కాదు.అయితే రేవంత్ చాలా నమ్మకం పెట్టుకున్న ఆయన ఇలా బీఆర్ఎస్ పార్టీతో ఎందుకు కుమ్మక్కయ్యారని.రేవంత్ కు ఎందుకు ద్రోహం చేశారన్నది హైలెవల్‌లో జరుగుతున్న చర్చ. దీనికి కూడా కారణాలు ఉన్నాయని అంటున్నారు. డబ్బుతో పాటు హనీట్రాప్ బారిన పడ్డారని.. బ్లాక్ మెయిల్ కారణంగానే ఇలా కోవర్టుగా మారారని అంటున్నారు. ఆయన ఎవరో.. ఇప్పటికే కొంత మందికి స్పష్టత వచ్చింది. రేవంత్‌కూ తెలిసిపోయి ఉంటుంది. ఆయన తీసుకునే నిర్ణయమే కీలకం కానుంది. ఇది నమ్మకద్రోహం కావడంతో.. క్షమించే అవకాశాలు ఉండవని అంచనా వేస్తున్నారు.ప్రభుత్వానికి సమాచార గోప్యత చాలా ముఖ్యం. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పకపోతే చాలా అపోహలు వస్తాయి. ప్రస్తుతం హిల్ట్ పాలసీ గురించే తీసుకుంటే...అసలు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించకముందే.. బీఆర్ఎస్ పార్టీ... స్కాం పేరుతో పెద్ద ఎత్తున ఆరోపణలు చేసింది. అవే ప్రజల్లోకి వెళ్తున్నాయి. ప్రభుత్వం తన వాదనను బలంగా చెప్పలేకపోతోంది. దీనికి కారణం ఈ లీకేజీనే. ఇలాంటివి గతంలోనూ జరిగాయి కానీ ప్రభుత్వం సీరియస్ గా తీసుకోలేపోయింది. అసలు ఎవరు సమాచారాన్ని లీక్ చేస్తున్నారో మాత్రం గుర్తించలేకపోయారు. ఫలితంగా ఇప్పుడు తీవ్రంగా చిక్కుల్లో పడాల్సి వస్తోంది. ప్రభుత్వంలో కీలక పొజిషన్లలో అత్యంత నమ్మకస్తులైన వారే ఉంటారు. వారు ఎంత నమ్మకంగా ఉండాలంటే.. ప్రాణం పోయినా సమాచారం బయట పెట్టకూడదు. అలా పెట్టేవారు ఉన్నారంటే.. ముఖ్యమంత్రి ప్రభుత్వంపై పట్టు సాధించలేదని అనుకుంటారు. అందుకే ప్రస్తుతం.. కోవర్టుగా గుర్తించిన కీలక వ్యక్తి విషయంలో ప్రభుత్వం కిందా మీదా పడుతుంది. ఎలాంటి కారణం అయినా సరే.. ఇలాంటి పరిస్థితి రావడం కాంగ్రెస్ ప్రభుత్వ వర్గాలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

## బాబ్రీ మసీదు కడతానన్న ఎమ్మెల్యేపై వేటు..

### టీఎంసీ నుంచి సస్పెన్షన్

**హైదరాబాద్ పెన్ పవర్:**పశ్చిమ బెంగాల్‌లో బాబ్రీ మసీదు ప్రతిరూపాన్ని నిర్మిస్తానని ప్రకటించిన అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎమ్మెల్యే హుమాయున్ కబీర్‌పై పార్టీ అధిష్ఠానం వేటు వేసింది. ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ముర్షిదాబాద్ జిల్లాలో డిసెంబర్ 6న మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తానని కబీర్ ప్రకటించడం తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ విషయంపై కోల్‌కతా మేయర్, టీఎంసీ సీనియర్ నేత ఫిర్హాద్ హకీం స్పందించారు. “మా పార్టీ లౌకిక సిద్ధాంతాన్ని విశ్వసిస్తుంది. ముర్షిదాబాద్‌కు చెందిన మా ఎమ్మెల్యే ఒకరు అకస్మాత్తుగా బాబ్రీ మసీదు కడతానని ప్రకటించారు. ఈ విషయంలో మేం ఆయన్ను ముందే హెచ్చరించాం. పార్టీ నిర్ణయం ప్రకారం హుమాయున్ కబీర్‌ను సస్పెండ్ చేస్తున్నాం” అని ఆయన తెలిపారు. ఇది బెంగాల్‌ను మతపరంగా విభజించేందుకు బీజేపీ అనుసరిస్తున్న విధానం లాంటిదని ఫిర్హాద్ హకీం ఆరోపించారు. “కబీర్ డిసెంబర్ 6వ తేదీనే ఎందుకు ఎంచుకున్నారు? మసీదుకు బదులుగా పాఠశాల లేదా కళాశాల నిర్మించవచ్చు కదా? ఎన్నికలకు ముందు ఇలాంటి విభజన రాజకీయాలు చేయడం అన్నది బీజేపీకి అలవాటు. కబీర్ కూడా ఇప్పుడు అలాంటి విభజన రాజకీయాలలో పడ్డారు “ అని ఆయన విమర్శించారు. ఎమ్మెల్యే కబీర్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు, శుక్రవారం టీఎంసీకి రాజీనామా చేసి, సొంత పార్టీని స్థాపించి మసీదు నిర్మాణం అంశాన్ని ముందుకు తీసుకెళ్లాలని కబీర్ యోచిస్తున్నట్లు సమాచారం. ఈ వివాదంపై గవర్నర్ ఆనంద బోస్ కూడా స్పందించారు. కబీర్ వ్యాఖ్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తుంటే, ఆయన్ను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. డిసెంబర్ 6న కార్యక్రమం నిర్వహించడానికి కబీర్‌కు అనుమతి ఉన్నప్పటికీ, ముర్షిదాబాద్ జిల్లాలో అధికారులు అప్రమత్తంగా ఉండి, భద్రతను కట్టుదిట్టం చేశారు.

## పొంగులేటి కంపెనీపై ఎఫ్ ఐఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబానికి చెందిన నిర్మాణ సంస్థపై భారీ భూకబ్జా ఆరోపణలు వెల్లువెత్తాయి. హైదరాబాద్ శివార్లలో రూ.300 కోట్ల విలువైన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలతో మంత్రి కుమారుడు హర్షా రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో ఉన్న తమ భూమిని కబ్జా చేసేందుకు నవంబర్ 30వ తేదీ అర్ధరాత్రి ప్రయత్నం జరిగిందని పల్లవి షా అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 70 మంది ముసుగులు ధరించిన వ్యక్తులు నాలుగు జేసీబీలతో అక్రమంగా ప్రవేశించి, ఆస్తి చుట్టూ ఉన్న ప్రహరీ గోడను ధ్వంసం చేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిని అడ్డుకోబోయిన తమ సిబ్బంది శివ చరణ్, శ్రీను, ధరంపాల్‌పై దాడి చేసి, చట్టవిరుద్ధంగా నిర్బంధించారని తెలిపారు. భూమికి సంబంధించి జిల్లా కోర్టు, హైకోర్టు నుంచి ఇంజక్షన్ ఉత్తర్వులు ఉన్నాయని చెప్పినా దుండగులు వినలేదని, స్థలంలోని గోశాలను, సెక్యూరిటీ గార్డు టెంట్‌ను కూడా కూల్చివేశారని బాధితురాలు ఆరోపించారు. దుండగులు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పేరు చెప్పినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. పల్లవి షా ఫిర్యాదు మేరకు పోలీసులు రాఘవ కన్‌స్ట్రక్షన్స్, న్యూజెన్ బిల్డర్స్ సంస్థలతో పాటు సుధీర్ షా, ప్రశాంత్ తదితరులపై అక్రమ చొరబాటు, దాడి, అక్రమ నిర్బంధం వంటి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖండించారు. తన కుటుంబ సంస్థపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేశారు. ఇది ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న భూవివాదమని, దీనితో తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.

## ట్రాఫిక్ చలాన్లపై రాయితీ ప్రకటించలేదు




**హైదరాబాద్ పెన్ పవర్:**
ట్రాఫిక్ చలాన్లపై 50 నుంచి 100 శాతం రాయితీ అంటూ కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీసులు చెక్ పెట్టారు. ఎక్స్ వేదికగా ఈ ప్రచారంపై వివరణ ఇచ్చారు. ఈ నెల 13న లోక్ అదాలత్ లు జరుగుతున్న విషయం నిజమేనని, అయితే చలాన్లపై రాయితీ వార్తలు మాత్రం అబద్ధమని తెలిపారు. వాహనదారులు అనధికారిక ప్రకటనను నమ్మకూడదని... కేవలం పోలీస్ శాఖ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ మాత్రమే చెక్ చేస్తూ ఉండాలని సూచించారు. ఫేక్ వార్తలు నమ్మొద్దని వాహనదారులకు సూచించారు. వాహనదారులకు శుభవార్త, మీ వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను లోక్ అదాలత్ లో రాయితీతో చెల్లించవచ్చునని ఆ వార్తల సారాంశం. ఈ నెల 13న ట్రాఫిక్ పోలీసులు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని, లోక్ అదాలత్ కు హాజరై వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను 50 శాతం నుంచి 100 శాతం వరకు రాయితీతో చెల్లించవచ్చని ఆ ప్రచారంలో పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల్లో అదే రోజున లోక్ అదాలత్ లు నిర్వహిస్తుండటంతో ఈ ప్రచారం నిజమేనని వాహనదారులు భావించారు. అయితే, ఈ ప్రచారం ఉన్నతాధికారుల వరకూ చేరడంతో తాజాగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. ట్రాఫిక్ చలాన్లపై రాయితీకి సంబంధించి తమ శాఖ నుంచి ఎలాంటి ప్రకటన చేయలేదని స్పష్టం చేశారు.

## పోలీస్ వెబ్ సైట్ హ్యాక్....




**హైదరాబాద్ పెన్ పవర్:**
బెట్టింగ్ యాప్స్‌పై యుద్ధం ప్రకటించి చర్యలు తీసుకుంటున్న తెలంగాణ పోలీసులకు సైబర్ నేరగాళ్లు సవాల్‌గా మారారు. ఏకంగా పోలీస్ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి అందులోనే బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేశారు. నెటిజన్లు, అవసరమైన వ్యక్తులు పోలీస్ వెబ్‌సైట్‌కు వెళ్లి ఏదైనా విభాగంపై క్లిక్ చేస్తే వెంటనే అది బెట్టింగ్ వెబ్‌సైట్‌లకు రీడైరెక్ట్ అయ్యింది. వెంటనే సమస్యను గుర్తించిన సైబర్ వింగ్ చర్యలు చేపట్టింది. సమస్యను పరిష్కరించింది. తెలంగాణ రాష్ట్ర పోలీస్ వెబ్‌సైట్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. అందులో ఏ విభాగంపై క్లిక్ చేసినా నేరుగా బెట్టింగ్ సైట్‌లకు రీ డైరెక్ట్ అయ్యేలా చేశారు. మెయిన్ వెబ్‌సైట్ ఆధారంగా మిగతా వెబ్‌సైట్‌లను కూడా నేరగాళ్ల తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. కొన్ని రోజుల నుంచి హైదరాబాద్ పరిధిలోని పోలీస్ కమిషనరేట్ల వెబ్‌సైట్‌లు సరిగా పని చేయడం లేదు. టెక్నికల్ టీం దీన్ని రెక్టిఫై చేయడానికి ప్రయత్నించింది. ఇంతలో సైబర్ నేరగాళ్లు తమ టాలెంట్ చూపించారు. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల వెబ్‌సైట్‌లను ఓపెన్ చేయడానికి ప్రయత్నిస్తే నేరుగా బెట్టింగ్ సైట్‌లు ఓపెన్ అవుతున్నాయి. వివిధ వర్గాల నుంచి ఫిర్యాదులు అందుకున్న ఐటీ విభాగం వెంటనే చర్యలు ప్రారంభించింది. సర్వర్ నుంచి వెబ్‌సైట్ ను హ్యాక్ చేశారని గుర్తించారు. అందుకే మెయిన్ సర్వర్‌ను డౌన్ చేసి సమస్యను పరిష్కరించారు. తర్వాత వెబ్‌సైట్‌లను పునరుద్ధరించారు. అందులో ఉన్న భద్రతా లోపాలను కూడా సవరించారు. పోలీస్ వెబ్‌సైట్ హ్యాక్, ఇతర వెబ్‌సైట్‌లలో బెట్టింగ్ యాప్స్‌వెబ్‌సైటలకు రీడైరెక్ట్ అవ్వడంపై పోలీసులు ఇంత వరకు స్పందించలేదు. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది. చాలా కాలంగా బెట్టింగ్ యాప్స్‌పై తెలంగాణ పోలీసులు విచారణ చేస్తున్నారు. యాప్స్‌ను ప్రమోట్ చేసిన వారిని పిలిచి విచారిస్తున్నారు. ఈ బెట్టింగ్ యాప్స్ వలలో పడిన అమాయకులు ప్రాణాలు తీసుకుంటున్నారని గ్రహించి పోలీస్ శాఖ చర్యలు ప్రారంభించింది. ఇప్పుడు వారి వెబ్‌సైట్‌నే హ్యాక్ చేసి బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసి సైబర్ నేరగాళ్లు వారికి సవాల్ చేశారు. దీనిపై పోలీస్ శాఖ రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి.

## తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్ కట్టి తీరుతాం

**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. జిల్లాల పర్యటనలో భాగంగా గురువారం సిఎం రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా రూ.18.7 కోట్ల అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన-విజయోత్సవ బహిరంగ సభలో సిఎం మాట్లాడుతూ.. “రెండేళ్లుగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నా. రెండేళ్ల క్రితం ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపారు. ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తిచేసుకుంటోంది. సంక్షేమం-అభివృద్ధి రెండుకళ్లుగా భావిస్తూ ముందుకెళ్తున్నాం. తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్ కట్టి తీరుతాం. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గనులు ఉన్నాయి. ఇక్కడ సిమెంట్ కంపెనీని మళ్లీ ప్రారంభిస్తాం. ఏడాదిలో ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ పనులు ప్రారంభిస్తాం. ఎర్ర బస్సు రావడం కష్టమనుకున్న ఆదిలాబాద్‌కు ఎయిర్‌బస్ తీసుకొస్తున్నాం. అత్యంత వెనకబడిన ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటా” అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.